మనీషి

– పి.చంద్రశేఖర అజాద్

(1991 ఏప్రిల్ నెల చతుర నుంచి రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)

(గత సంచిక తరువాయి)

భూషయ్యగారి బట్టల విషయం గురించి పిల్లలేకాదు ఆ ఊర్లో మరికొందరు కూడా మాట్లాడుకుంటారు. ఆ ఊర్లో భూషయ్యగారిలాంటివారు మరికొందరు ఉన్నా కొన్ని విషయాల్లో భూషయ్యగారు మరీ ప్రత్యేకంగా ఉంటాడు.

"ఈ మానవుడు మన ఊరికి వరం" అనంటే

"భూషయ్యగారు పెళ్ళప్పుడన్నా చొక్కా ఏసుకున్నాడా?" అనెవరో అడిగారోసారి.

"మొత్తం మీద ఆ కొంచెసేపూ వేసుకునే ఉంటాడు. అయినా నాకు తెలీక అడుగుతా ఎప్పుడూ పనిచేస్తానే ఉంటాడు. మరి సంపాయించిన డబ్బంతా ఏం చేస్తాడో?"

"ఆఁ నా బొంద సంపాదన. మాకో మావయ్య ఉన్నాడు ఆయనకి హోటలుంది. అయిదు గంటలకి లేచి ఉల్లిపాయలు కోస్తూ చెబుతుంటాడు. 'ఒరేయి నేను స్వయంగా ఉల్లిపాయలు తరుగుతున్నారా? జనం ఎందుకురారు' అని. చివరికి ఆయన ఏదో హోటల్లో ఉల్లిపాయలు తరుక్కోవాల్సి వచ్చింది. జనానికి కావల్సింది ఏమిటో తెలియాలిగాని ఆయన ఉల్లిపాయలు తరగటం కాదు. అట్టాగే భూషయ్యగారి సేద్యం గురించీ, ఆయన సంపాదన గురించీ, ఆ తులసమ్మగారికి తెలియాలి. లేకపోతే ఆ పూర్ణయ్యగారికి తెలియాలి."

"ఆయనకేం తెలుసు?"

"ఈయన వ్యవహారమంతా ఆ పూర్ణయ్యగారే చూసుకుంటాడు. భూషయ్యగారికి డబ్బులు కావాలన్నా భూషయ్యగారి దగ్గర డబ్బులున్నా ఆయనే చూస్తాడు."

"అంటే వడ్డీకిస్తాడా?"

"అవును ఆ వడ్డీ ఎంతలే. అయినా ఆయనకి తప్పితే ఇంకో మానవుడికివ్వడు"

"అదేంటి?"

"నమ్మకమయ్యా. అదంతే"

"భూషయ్యమావకి మినిష్టరైతే ఏం చేస్తాడు?"

"దేశంలో బట్టల మిల్లులన్నింటినీ మూయించేస్తాడు. ఎవడి పొలం ఆడు దున్నుకోవాలి. ట్రాక్టర్లు వాడకూడదు అని శాసనం చేస్తాడు."

అందరూ నవ్వుకుంటారు.

వారందరూ అలా నవ్వుకుంటారని కాదు. భూషయ్యగారి అభిప్రాయాలు అలానే ఉంటాయి. ఆయన పాతకాలం నాటి మనిషి.

"నాకెందుకయ్యా టాక్టరు. నా వొంట్లో ఓపిక లేకపోతేగందా. ఆడికి చెప్పి వదిలి పెడితే నిముషాల్లో అవతలికెల్తాడు. ఏవైనా నేను దగ్గరుండి సేయించుకోవాల" అంటాడు.

పూర్ణయ్యగారు ఆ ఊర్లో ధనికరైతు. ఆయనకు చాలా పొలం ఉంది. పొలం కాకుండా ధాన్యం కొంటాడాయన. ఇంకా అపరాలు కూడా కొంటాడు. అందుకని ఆయనకు ఇస్తాడు. అందరికంటే ఆయన ఇచ్చే వడ్డీ తక్కువే. అయినా కూడా భూషయ్యగారు ఆయనకే ఇస్తాడు.

అందుకు భూషయ్యగారికున్న కారణాలు వేరు.

పూర్ణయ్యగారు ఎప్పుడు కావాలంటే అప్పుడు డబ్బులు సర్దుతాడు. రెండోది ఆయన ప్రాణం పోయినా అబద్ధం చెప్పడు. డబ్బులేకపోతే ఈరోజు లేదంటాడు తప్పించి ఎప్పుడూ ఇతరులిచ్చిన డబ్బు ఎగవేసే ప్రయత్నం మాత్రం చేయడనే గట్టి నమ్మకం ఆయనకుంది.

ఒక్కోసారి తులసమ్మ కూడా అంటుంది.

"నీకు డబ్బులు చేతిలోకొస్తే చాలు ఆ పూర్ణయ్యగారు కనబడతారు"

"అదేంటే"

"మరి లేకపోతే ఏమిటంట? ఆయనిచ్చే వడ్డీ ఎంత? ఇంకెవరి కన్నా చూసి ఇవ్వకూడదూ"

"ఆడాళ్ళ మాటలు ఇట్టాగే ఉంటాయి. మన వెంకట్రామయ్యగారి బుల్లబ్బాయి తెలుసుగా"

"అయితే"

"ఆడేడుత్తున్నాడు. రెండు రూపాయల వడ్డీ వస్తందని చెప్పి మొత్తం తీసుకెళ్ళి పోశాడు. ఇప్పుడేం చేయాలో తెలవక కొట్టుకుంటున్నాడు."

"ఏందోలే నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి" అంటుందామె.

భూషయ్యగారి గురించి నవ్వుకుంటూ మాట్లాడుకున్నంత మాత్రాన ఆయనంటే ఊర్లో వారికి గౌరవం లేదని కాదు. తనెప్పుడూ ఎవరి సొమ్ము గురించీ ఆశపడడు. తనకు చేతనయినంత సహాయం చేస్తాడు. అంతకుమించి ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం ఆయనకే మాత్రం ఇష్టం ఉండదు. తన పనేదో తను చేసుకు పోయే వ్యక్తిగానే ఆయన్ని పరిగణిస్తారు.

సాంబయ్య ఎదురు చూసిన బట్టలు రానే వచ్చాయి.

"అమ్మా..అమ్మా... నేను కొత్త బట్టలు వేసుకుంటానే" అన్నాడు సాంబయ్య.

"ఇప్పుడెందుకు పండగరానీ" అందామె.

అదేం వినకుండా కావాలని కొత్తబట్టలు వేసుకుని బడికి వెళ్ళాడు. ముందు మాస్టారు పిలిచారు.

"ఏంటిరో సాంబయ్య ఈ రోజు కొత్త బట్టలు వేసుకున్నాడే" అన్నారు. ఆ బడిలో సాధారణంగా ఎవరూ కొత్త బట్టలు వేసుకోరు. ఏ పండగలప్పుడో మాత్రమే కొత్త బట్టలు.

"చాలా బాగున్నాయిరా" అని మాస్టారంటుంటే సాంబయ్యకి గర్వంగా అనిపించింది.

అవుట్ బెల్ కొట్టాక పిల్లలందరూ సాంబయ్య చుట్టూ చేరి "భలే ఉందిరా ఎప్పుడు కుట్టించావ్" అన్నారు.

సాంబయ్య అందరికీ చెబుతున్నాడు.

అప్పుడో పిల్లవాడు అడిగాడు.

"సాంబయ్యా కొత్త చొక్కా, లాగూ కుట్టించావ్ బాగానే ఉంది. మరి మీ నాన్న జేబులో పెట్టుకోడానికి డబ్బులిచ్చాడా?"

"ఎందుకు?" అన్నాడు సాంబయ్య.

"ఎందుకేమిటిరా? కొనుక్కుంటానికి. అసలు నువ్వెప్పుడూ పదిపైసలయినా తీసుకురావెందుకురా? మీ నాన్న ఇవ్వడా? మాకు తెలిసి నాయన కొత్త చొక్కాలు కుట్టించుకుంటే ముందు జేబులో డబ్బులు మెరుస్తుంటాయి తెలుసా?"

సాంబయ్య తెలియదన్నట్లు అడ్డంగా తలూపాడు.

"నువ్వెప్పుడైనా వందరూపాయల కాయితం చూశావా?" అన్నాడు.

"చూడలేదురా. నువ్వు చూశావా?"

"చూశా కూడా, అసలు మీ నాన్న చూశాడా?" అన్నాడా కుర్రాడు.

"ఏమోరా నాకు తెలియదు" అన్నాడు సాంబయ్య.

అప్పటికి గంట మోగటంతో ఎవరి తరగతులకి వాళ్ళు వెళ్ళిపోయారు.

సాంబయ్యకు కొత్త చొక్కా తొడుక్కున్న సంతోషంలో చాలా భాగం కరిగిపోయింది. ఇప్పుడదంతా శూన్యంగా కనిపిస్తుంది. దానిలో డబ్బులుంటే బాగుండేదనిపిస్తుంది. నాన్న ఎప్పుడూ డబ్బులు ఇవ్వడు. నాన్నే కాదు అమ్మకూడా ఇవ్వదు.

"అక్కడ కొనుక్కోవటం ఎందుకురా నీకేం కావాలో చెబితే నేను ఇక్కడ చేసి పెడతాగా" అంటుందామె.

బడినుండి ఇంటికి వస్తుండగా అనుకున్నాడు సాంబయ్య.

"నాన్న ఎంతవరకు చదువుకున్నాడో తను బడికి వెళ్తున్నప్పుడు తాత దగ్గర డబ్బులు తీసుకునేవాడు కాదా? ఇంతకూ నాన్న వందరూపాయల కాయితం చూశాడా?"

తను ఎదురు చూసినంత సంతోషం తన పిల్లవాడిలో కనిపించకపోయేసరికి "ఏం సాంబయ్య" అంది.

"అమ్మా నాకు డబ్బులివ్వవూ" అన్నాడు.

"ఎందుకురా?"

"రేపు బళ్ళో కొనుక్కుంటానమ్మా"

"ఏం కొనుక్కుంటావ్?"

"అయిసూ, పప్పుచెక్కా"

"వద్దమ్మా.. అవి మంచివి కాదు. నేను చేసి పెడతాగా"

"అయిసు కూడా చేస్తావా?"

"అదెట్టారా?"

"మరి మా బళ్ళో పిల్లలందరూ కొనుక్కుంటున్నారుగా."

"తులసమ్మకు ఏం చెప్పాలో తెలియలేదు.

"మీ నాన్ననడిగి తీసుకో"

"నేనడగను."

"ఏమనడులే" అంది.

"నేనడగను. మా బళ్ళో ఏమన్నారో తెలుసా?"

"ఏమన్నారు?"

"మీ నాన్న ఎప్పుడన్నా వందరూపాయల కాయితం చూశాడా అన్నారు."

తులసమ్మ నోరు తెరిచింది.

"ఏం భూషయ్యగారూ డబ్బులు కావాలని చెప్పి వెళ్ళారంట దేనికి? ఎరువుల కట్టకా?" అన్నాడు పూర్ణయ్యగారు.

"లేదు. మా సాంబయ్యగాడికి బట్టలు చింపిచ్చింది. ఆడికి డబ్బులియ్యాల. ఆడేమో బడికి పోయొచ్చి గొడవచేయటం, మా యింటిదేమో అదితే.. ఇదితే అని సతాయించటం" అని గొణిగాడు.

ఆయన నవ్వుతూ చెప్పాడు.

"మీరు మరీనూ, మనం ఉండే పద్ధతుల్లో మన పిల్లలూ ఉండాలంటే కుదరదు. అలా ఉండలేరు కూడా. మా నాన్న చెప్పినట్లు నేనుండలేదని ఆయన చాలా బాధపడుతుండేవాడు. ఇప్పుడు నేనూ అంతే, రోజులు మారిపోతున్నాయి భూషయ్యగారూ. అయినా రెండు జతల బట్టలు కుట్టించారు అంతేగా, చదువుకునే పిల్లలకి ఆ మాత్రం అవసరం లేదా? మీ వాడింకా నయం ఏమీ అడగడు. మా వాళ్ళయితే పండగ పండగకీ బట్టలు కుట్టించాల్సిందే" అన్నాడాయన.

ఆ క్షణం సాంబయ్యను తలచుకుని ఆనందించాడు భూషయ్య. ఆయన ఇచ్చిన డబ్బు తీసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి త్వరగా నిద్రపట్టలా. తులసమ్మతో సంభాషణకి దిగాడు.

"పూర్ణయ్యగారు మన సాంబయ్యగాడిని మెచ్చుకున్నారే" అంటూ మొదలు పెట్టాడూ.

"ఎందుకు మెచ్చుకోరూ. నువ్వు తప్పితే అందరూ మెచ్చుకుంటారు.

"ఓయ్.." అన్నాడు సరిగ్గా వినపడక.

"దేనికంటా?" అంది తులసమ్మ.

"ఆడు నిన్నేమీ అడగడయ్యా అన్నాడాయన"

"అది సరేగానీ నాకు తెలియకడుగుతా ఆడిచేతిలో ఎప్పుడైనా పది పైసలుబెట్టావా?"

"ఎందుకే"

"ఆడుకుంటానికి. ఎందుకంటావేంటి? డబ్బులు ఎందుకంట?"

"ఇంటో తిండి చాలటం లేదా?"

"అబ్బో పంచభక్షపరమాన్నం పెడుతున్నావుగా"

"ఏందోవ్.. మా జోరుగా ఉన్నావే" అన్నాడు.

"లేకపోతే ఏందయ్యా. ఎప్పుడూ చేనంటావ్, పనంటావ్, గొడ్డకాడ బాగుసేయాలంటావ్. మరి ఊర్లో కెళ్ళినప్పుడు ఆ కోమటికొట్లో ఓ అణాకారప్పూసగానీ ఓ లడ్డుగానీ ఆడికి తెచ్చిచ్చావా? ఇంట్లో పిల్లాడుంటాడనే ఆలోచన రాదేంటి?"

"ఆడికి తేవాలా? నీక్కూడానా?"

"అబ్బో.. సడసం. నువ్వు తెచ్చిన పూలు మోయలేక నా మెడలు పట్టాయి. నువ్వు తెచ్చిన లడ్లు తిని విరోచనాలయ్యాయి" అంది తులసమ్మ.

"వాయబ్బో" అన్నాడు.

"మరేందయ్యా తెల్లారి లేసిందగ్గర్నుండి ఆడ్ని పట్టుకుని ఆ పేడకళ్ళు తియ్యి తియ్యి అంటావు తప్పితే ఇదిగో ఈ పావలా డబ్బులు తీసుకెళ్ళి కొనుక్కో అని ఎప్పుడన్నా ఇచ్చా?" అంది.

"ఆఁ ఇంకా"

"ఇంకా కూడా చెప్పాలా. నువ్వెప్పుడన్నా వంద కాయితం చూశావా?" అంది.

"ఏందోవ్" అన్నాడు భూషయ్య.

"అవునయ్యా. బళ్ళో తవరి గురించి మీ అబ్బాయిని అడిగేదది. మీ నాన్న చొక్కా ఎందుకేసుకోడు? మీ నాన్న వందకాయితం చూశాడా? అని"

"మీ అమ్మా కొడుకులకేంటీ చెబుతారు. అవును మరి. నేను బురద తొక్కి బతికేవోణ్ణి. వందకాయితాలెట్టా చూత్తాను. కొత్త బట్టలు కొత్త బట్టలన్నావ్. అదయిపోయింది. ఇప్పుడు డబ్బులు డబ్బులంటన్నావ్. తయారుచెయ్యి" అన్నాడు.

"ఏంటీ... తయారు చెయ్యాలి అయినా నా బిడ్డ బంగారంలాంటోడు. ఇదిగో ఇదివ్వు అంటూ అడిగాడా? ఏదో ఇంటో నాలుగు మెతుకులు తిని చదువుకుంటున్నాడు. ఎప్పుడన్నా ఆ మినప్పిండితో ఆవిరికుడుం చేసి పెడ్తే తింటాడు. చుట్టుపక్కల చూత్తే కళ్ళు తిరుగుతాయి. ఆళ్ళకి ఎప్పుడూ కాయాకమ్మా ఉంటాది. ఆ మొగాళ్ళు కూడా బయటికెళ్తే చాలు చేతో ఏదో పొట్లాం తీసుకురాందే రారు. నువ్వుకాక వొళ్ళొంచుతున్నావు. అందరూ పండిచ్చే దానికన్నా ఏం పండిస్తన్నా."

"ఏందే దడదడలాడించేత్తన్నావ్" అంటూ లేచి బయలుదేరాడు.

"ఎక్కడికీ అటుబడిపోతావ్"

"గడ్డి తొక్కేసాయేమో చూసొత్తా"

"అవును మరి. ఆటికడుపు నిండకపోతే నీ కడుపు నిండదుగా కానీ" అంది.

భూషయ్య వెళ్ళి చూసాక..

"అయ్యయ్యో అప్పుడే రొచ్చు రొచ్చు అయిందే" అని గడ్డి తీసుకొచ్చి వాటిముందు పడేసి వచ్చాడు.

"ఏంటే తులసమ్మా ఇప్పుడు చెప్పు" అన్నాడు.

తులసమ్మ మాట్లాడలేదు.

"అయి నోరులేని జీవాలే. ఆటికి ఆకలయితే అడగటానికి నోరేది. పొద్దుగూకగానే గడ్డివేసినా ఉచ్చలు పోసి రొచ్చు చేస్తాయి. ఇంక తినవు. తెల్లారేదాకా అట్టాగే పడుకోవా. ఆటిని తలుచుకుంటే బాధగా ఉండదూ" అన్నాడు.

"గొడ్డాకలి తెలిసినోడికి బిడ్డాకలి తెలివొదంటయ్యా" అంది.

"బిడ్డాకలి తల్లి తెలుసుకోవాల" అన్నాడు.

ఆ రాత్రి భూషయ్య తన భాషతో సుదీర్ఘంగా చెప్పుకొచ్చాడు.

అదంతా సాంబయ్య వింటుండిపోయాడు.

భూషయ్యగారు పెద్దగా చదువుకోలేదు. రెండు మూడు సంవత్సరాలు బడికి వెళ్ళటం జరిగినా అవంత లెక్కలోవి కావు. మొదటి నుండి బడికంటే కూడా ఆయన్ని ఆకర్షించిన అంశాలు ప్రకృతీ. పశువులూ. వాళ్ళింట్లో ఎప్పుడూ పాడివుండేది. సూడిగేదెల్ని మేపుకు రావటంలో పశువులను కడగటానికి చెరువుకు తీసుకు వెళ్ళటంలో ఎప్పుడూ తను ముందుండే వాడు. చెరువులోపడి ఆ గేదెల్ని తళతళలాడేట్లు తోమేవాడు. అందుకోసం ప్రత్యేకంగా గడ్డి తీసుకుపోయేవాడు.

పశువుల చావిడి ఎప్పుడూ శుభ్రంగా వుండాల్సిందే ఈ పనిచెయ్యి అంటూ వాళ్ళ నాన్న ఎప్పుడూ చెప్పేవాడు కాదు. బడికి వెళ్తానంటే వెళ్ళమన్నాడు. ఆ తర్వాత బడి సాంతం మానుకుని గేదలు కాసే కుర్రాళ్ళతో తిరిగినా ఏమీ అనలా. గొడ్డకాడ బుడ్డాళ్ళందరితో కలసి ఆటలూ, పాటలూ అన్నీ.

బండి కట్టడం, వాటిని నడపటం. పొలం దగ్గరకు వెళ్ళటం భూమిని దున్నటం దమ్ముచేయటం. నారు పీకటం ఎరువులు చల్లటం మాసూలు చేయటం. ఈ పనులన్నింటివల్లా భూషయ్యలో ఓ గాఢమైన అనుభూతీ, నమ్మకం కూడా ఎదగటం ఆరంభించాయి.

ఆయన దృష్టిలో తమ ఇంట్లో పనిచేసేవారికీ తమతోపాటు పనిచేసే పశువులకీ తమకూ భేదంలేదు. ఈ ప్రపంచంలో ఆయనకు అత్యంత ఇష్టం అయినది భూమి. తనకు సంక్రమించిన భూమి ఓ ఎకరం ఉంటుంది. ఇప్పుడది రెండున్నర ఎకరాలు అయింది అలా కావటం వెనక తన శ్రమ ఉంది. భీముడులాంటి వారి శ్రమ ఉంది. వాటితోపాటు తమ పశువులదీ ఉంది.

అందుకే వాటి సంరక్షణపట్ల అంతగా ఆరాటపడతాడు. మానవుడూ, జంతుజాలం ప్రేమపూర్వకంగా, స్నేహపూర్వకంగా ఈ ప్రకృతిలో భాగం కావాలనటానికి ఆయన ఓ సజీవ ఉదాహరణ. అది ఎంతటిస్థాయికి చేరుకుందంటే తన ఒక్కగానొక్క కొడుకు విషయం గురించి నిజంగానే ఆలోచన తట్టదు.

తను బజారుకి వెళ్తాడు. అక్కడ చిన్న హోటలు ఉంది. అక్కడ కూర్చున్నవారందరూ ఏదో ఒకటి తింటుంటారు. పిలిచి పలకరిస్తుంటారు. అయినా కూడా తను జవాబు చెప్పి బయటకు వస్తాడు తప్పించి ఏదైనా తినాలనిపించదు. పక్కనే అద్దాలమాటున కనిపించే తినుబండారాల్ని చూసినా అదే దృష్టి. కానీ వంట్లో ఎంత బాగుండకపోయినా ఓపిక చేసుకుని లేస్తాడు. పశువుల కోసం.

అవును మరి. అవి పశువులు. వాటికి నోరులేదు. అవి నోరు తెరిచి అడగలేవు. తమ రక్తాన్ని పాలుగా మార్చి అందిస్తున్నాయి. తమ శ్రమతో భూమిని పులకరింపజేస్తున్నాయి. అలాంటివాటితో ఆయన ఏర్పరచుకున్న ప్రపంచంలోకి తొంగిచూస్తే తప్ప ఆయన అర్థంకాడు.

ప్రతిరోజూ తన పొలం తనకు కొత్తగానే కనిపిస్తుంది. అందులో ఎదిగి వచ్చే పంట చూసుకుంటే ఏదో తృప్తి. తను లెక్కలు కూడా చూసుకుంటే ఏదో తృప్తి. తను లెక్కలు కూడా చూసుకోడు. పంట చేతికందివచ్చాక డబ్బు మిగిలితే పూర్ణయ్యగారి దగ్గరకు వెళ్తుంది.

ఓసారి ఆయనే ఎప్పటినుండో లెక్కలు చూసి చెప్పాడు. "భూషయ్యగారూ డబ్బులు లెక్కచూద్దాం"

"అదేదో మీరో చూడండి"

"అదేంటి డబ్బులు ఏం చేద్దారని?" అన్నాడాయన.

"చేసేదేముంది. ఇంకోటి చేయటానికి నాకేం తెలుసు. భూమి కొనుక్కుంటా" అన్నాడు.

ఆయన చేతులమీదుగానే ఆ ఒకటిన్నర ఎకరం కొన్నాడు. అందులో కొంతభాగం ఆయన దగ్గర్నుండే అప్పు తీసుకున్నాడు. పంటలు వస్తున్నాయి. డబ్బుల విషయం పూర్ణయ్యగారికే తెలుసు.

వందరూపాయల కాయితం అనేకాదు. వెయ్యిరూపాయల కాయితం అయినా ఆ మహానుభావుడి కళ్ళకు గొప్పగా కనిపించదు. ఆయన దృష్టిలో అవి విలువలేనివి అంటే మారకపు విలువ అనికాదు.

ఆయనకి తన ఆరాటం తప్పించి తన బాల్యం, తనతోపాటు రక్తం పంచుకు పుట్టినవారూ, వీరంతా గుర్తుకు వస్తారా అన్నంత సందేహం కలుగుతుంది. ఆయన దృష్టిలో సాంబయ్య గురించి పత్యేక ప్రణాళికలు ఏంలేవు.

"చదువుకుంటానంటే చదువుకుంటాడు. లేకపోతే నేను నమ్ముకున్నట్టు ఆడూ భూమిని నమ్ముకుంటాడు" అనుకుంటాడాయన. భూషయ్య మాట్లాడుతూనే ఉన్నాడు.

తులసమ్మకి ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

సాంబయ్య బడికి వెళ్తుంటే తులసమ్మ పిలిచి "బాబూ ఇదిగో" అంటూ పదిపైసలు చేతిలో వుంచింది. ఆ క్షణం సాంబయ్య కళ్ళలో కనిపించిన ఆనంద్మ బహుశా ఆమెకు ఎప్పటికీ మరపుకు రాకపోవచ్చు.

"కొనుక్కోమంటావా అమ్మా" అన్నాడు. అనుమానంగా.

"అందుకేగా.. ఇచ్చాను" అంది.

"మరి నాన్నకు చెప్తావా?"

"అయన్నీ నీకెందుకు? నువ్వు మాత్రం బాగా చదువుకోవాలి" అంది.

"మా అమ్మ మంచిది" అనుకుంటూ బడికి వెళ్ళిపోయాడు సాంబయ్య. తులసమ్మ కూడా ఈ రకంగా జీవించాలని ప్రత్యేకమైన ఆలోచనలంటూ లేవు. అసలు వారికి తీరిక లభించటమే తక్కువ. ఎప్పుడూ ఏదో ఒక పనిలో నిమగ్నం అయివుంటారు. ఉదయం అంతా వంటపనీ, ఊడ్చుకోవటం, అంట్లు తోముకోవటం సరిపోతుంది.

భోజనం చేశాక కూడా నడుం వాల్చరు. తులసమ్మగారింటికి రాట్నాలు తెచ్చుకుని కొంతమంది వస్తారు. తనేమో బియ్యంలో రాళ్ళు ఏరుకోవటమో, పీట వేసుకుని మినుములు చేయటమో, ఏ పిండి అయినా విసురుకోవటమో చేస్తుంటుంది. అసలు ఆమె ఎప్పుడూ చీపురు పట్టుకుని ఈ మూలనుండి ఆ మూలకు ఊడుస్తావుంటుంది.

ఆ ఇంటికి పెద్ద స్థలమే ఉంది. అదంతా ఊడవాలంటే నడుములు పట్టుకుపోతాయి. అయినాసరే ఉదయమూ, సాయంకాలమూ ఊడవాల్సిందే ఇంకా ఎక్కడైనా గడ్డిపరకలులాంటి వుంటే భూషయ్య ఊడుస్తాడు.

ఆ దొడ్లో ఓ పక్క పాదులుచేసి వంగ, బెండ విత్తనాలు చల్లాడు. ఇంక సారపాదు విషయం చెప్పే పనిలేదు. అది విరగ కాస్తుంటుంది. భూషయ్యగారే కోసుకుని అందరికీ ఇచ్చివస్తుంటారు.

"అయ్యా తినలేక చచ్చిపోతున్నాం. ఇంకెందుకు చాలు" అన్నా ఊరుకునేవాడు కాదు. తులసమ్మకి బట్టల విషయంలో ఆయనంత చాదస్తంలేదు. అలా అని ఆమె ఖరీదైన బట్టలు వేసుకోదు. తనకు ఉన్న బట్టల్ని మాత్రం శుభ్రంగా ఉంచుకుంటుంది.

వాళ్ళ ట్రంకు పెట్టెల్లో భూషయ్య పెళ్ళికి కుట్టించుకున్న చొక్కా ఆమె కట్టుకున్న పట్టుచీరా వుంటాయి.

ఆ ఇంట్లో ఓ మూలగా భగవంతుడి విగ్రహాలుంటాయి. వాటిలో వినాయకుడూ, ఆంజనేయస్వామీ ఇంకా మరికొందరు వుంటారు. అయితే నిత్యమూ పూజలు చేయటంలాంటిది ఆమె చేయదు. ఏ శ్రావణ శుక్రవారాలప్పుడో తలంటుకుని భక్తిగా నమస్కరిస్తుంటుంది.

భూషయ్యగారి విషయం అయితే ఇంక చెప్పే పనేలేదు. ఆయనకి దేవుడు చాలా తక్కువగా గుర్తొస్తాడు. ఏ పండగలప్పుడో మాత్రం ఇంటిదగ్గర ఉంటాడు. అప్పుడూ మంచమ్మీద కూర్చుని తులసమ్మతో ఏదో చెబుతుంటాడు. పొలం గురించి అడుగు..

"బాగానే వుంది. మరి చేతికి రావాలిగా" అంటాడు.

పిల్లవాణ్ణి గురించి అడుగు.

"ఆడా బడికయితే ఎల్తన్నాడు మరి" అనేసి "ఓయ్" అంటాడు.

పాడి గురించి అడుగు.

"ఏదో ఇత్తందిలే" అంటాడు.

ఇంకేమైనా అడిగినా ఇలాంటి సమాధానాలే వస్తాయి. అంతకుమించి తనేం అడగడు. అసలు అడగాలనిపించదు. తనను త్వరత్వరగా ప్రశ్నలు అడగటం పూర్తిచేస్తే ఇంక వెళ్ళిపోతానుగదా అన్నట్లుంటాడు. సాంబయ్య ఔట్ బెల్లులో అయిసుబండి దగ్గరకి వెళ్ళాడు.

"సాంబయ్యా అయిసు కొంటున్నావా?" అంటూ వచ్చాడో కుర్రాడు.

"అవున్రా. మా అమ్మ డబ్బులిచ్చింది."

"నాక్కూడా కొనిపెట్టరా"

"నా దగ్గర పదిపైసలే వుందిరా" అన్నాడు.

"రెండొస్తాయిగా" అంటూ తనే తీసుకుని కొనుక్కుని వచ్చి సాంబయ్యకి ఒకటి అందించి "చాలా బాగుందికదూ" అన్నాడు. సాంబయ్య అవునన్నట్లు తలూపాడు. ఆ తర్వాత ఆ పిల్లవాడు తన స్నేహితులందరితోనూ ఘనంగా చెప్పాడు.

"ఈరోజు సాంబయ్య నాకు అయిసు కొనిపెట్టాడు తెలుసా?" అంటూ.

సాంబయ్య కూడా అందరికేసీ గర్వంగా చూశాడు.

"సాంబయ్యా ఇకనుంచి రోజూ కొనుక్కుంటావా?" అన్నాడతను.

అప్పుడు సాంబయ్యలో మార్పు వచ్చింది.

"ఏమోరా? ఈ రోజయితే మా అమ్మ ఇచ్చింది" అన్నాడు.

సాంబయ్యలో కూడా ఓ ప్రత్యేకమైన గుణంవుంది. తను కూడా ఎటువంటి పరిస్థితులలోనూ గొప్పలు చెప్పుకోడు. తను ఎప్పుడన్నా బాధపడతాడు తప్పించి అది కప్పిపెట్టుకోవాలనే ఆలోచనే రాదు.

ఆ రోజు తమ క్లాసుకి మాస్టారు రాకపోతే సాంబయ్యా, ఇతర పిల్లలూ కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. ఒక్క సాంబయ్య మాత్రమే శ్రోతగా ఉండిపోయాడు. అందరూ అంత గొప్పగా చెప్పుకొచ్చారు.

"అసలు మా నాన్నయితే నాకు చాలా డబ్బులు ఇస్తార్రా. నేను అడక్కపోయినా సరే ఇస్తారు. అంతగా ఇవ్వకపోయినా సరే నేనే ఆయన జేబులో చెయ్యిపెట్టి తెచ్చుకుంటా"

"మా అత్తయ్య దగ్గరికి వెళ్తే చాలు రూపాయలు రూపాయలిస్తుంది. నేను కూడా రేపు సెలవులకి అక్కడికి వెళ్ళిపోతా"

"మా నాన్నేమో రాత్రిపూట నా దగ్గరే పడుకుంటాడు. బాగా చదువుకుంటే సైకిల్ కొనిపెడ్తానన్నాడు. ఇంక దెక్కి రయ్ రయ్‌మంటూ తొక్కుకుపోవటమే"

"మాక్కూడా ఇస్తావంట రా"

"అసలు నేను ఈ ఊర్లో ఏడోతరగతి అయిపోగానే ఈ ఊరునుంచి వెళ్ళిపోతా. ఎప్పుడయినా శెలవులప్పుడే వస్తా"

"నేనూ అంతేరా. మా మావయ్యావాళ్ళుకూడా నన్ను పంపించెయ్యమంటున్నారు. ఇక్కడయితే చదువు బాగా రాదు. పిల్లలు చెడిపోతారు. అని మా అమ్మకి చెబుతుంటే నేను విన్నాను."

సాంబయ్య అందరినీ చూస్తున్నాడు.

తనకూ అత్తయ్య వుంది. ఎప్పుడన్నా అత్త దగ్గరకు వెళ్తే..

"మీ అమ్మేం చేస్తందిరా సాంబయ్యా" అంటుంది. లేదా "ఓసారి కనపడమని చెప్పురా" అంటుంది.

అంతేగాక బళ్ళారి వెళ్ళిన వారి గురించి మాట్లాడదు. తన నాన్నకూడా అంతే. వాళ్ళయినా ఒక్కసారి వస్తే బాగుండుననిపిస్తుంది సాంబయ్యకి.

"అమ్మో అంత దూరం నుంచి రావటమే" అన్నప్పుడు.

ఎంత దూరం అయివుంటుందో అనే ఆలోచన కలుగుతుంది.

అయితే వారు రారు. అంతకుమించి భూషయ్య ఇంటినుండి కదలడు. ఇంక తులసమ్మ బాగుంటుంది అనుకోవటం ప్రారంభించాడు సాంబయ్య. అది లేదు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS